# అంజలి

ఎ.వి. రమణీ కుమారి



ఆఫీసు ప్యూను శేషయ్యకోసం ఎదురు చూస్తూ కూచుంది శశి. రోజూ లంచ్ టైమ్‌కి కొంచం ముందుగానే వచ్చే శేషయ్య ఆ రోజు ఇంకా రాలేదెందుకా అని ఆలోచిస్తూ- స్కూలు ఆవరణలో ఓ చెట్టుకింద అరుగుమీద కూచుంది శశి.

తన క్లాస్‌మేట్సు కొందరు కారియర్స్‌లో, టిఫిన్ డబ్బాల్లో తెచ్చుకున్న టిఫిన్ తినేస్తున్నారు- దోస్తులతో కులాసా కబుర్లు చెప్పుకుంటూ.

గరల్స్ హైస్కూల్ ఆవరణ ఒకే యూనిఫారమ్ వేసుకొని ఉత్సాహంగా ఆనందంగా కనిపించే విద్యార్థినులతో కళకళలాడుతోంది. అక్కడక్కడా ఉన్న పచ్చని చెట్లనీడలలో కొందరు పిల్లలు ఏవో ఆటలాడుకుంటూ ఉన్నారు.

శశి స్టాఫ్ క్యాంటీన్‌కు పోయి ఏమన్నా టిఫిన్ చేద్దామని అనుకుంటూ ఉండగా, తళతళలాడుతోన్న టిఫిన్ కారియర్ చేతులో పట్టుకొని చెమటలు కార్చుకుంటూ దూకుడుగా వచ్చేడు శేషయ్య.

'ఆల్సెం అయింది తల్లీ! ఏమను కోకండమ్మా!' అంటూ క్యారియర్ అందించి- ఓ పక్కగా విలబడిపోయేడు శేషయ్య. తలగుడ్డ తీసి ఉస్సురంటూ నుదుటిమీది చెమట తుడిచేసుకొంటున్న శేషయ్యను చూచి జాలిపడింది శశి.

శశి టాప్ దగ్గర చేతులు కడుక్కొని వచ్చి- 'శేషయ్యా! ఈ ఒక్కరోజుకీ

రెస్ట్ తీసుకోకపోయావా?' అంది. కారియర్ తెరిచి కూరన్నం కలుపుకుంటూ।

'రెస్టు దేనికి బాగానే ఉన్నా కదమ్మా। ఓటిదో బోటిదో సైకిలుమీదే కదమ్మా వచ్చేది. కష్టమేవుంది ఇందులో। అదేటో ఈ రోజు ట్రాపికు మరీ గగ్గోలుగా ఉందమ్మా। అందులో అడుగడుగునా ఈ చిగ్నల్ లైట్ల బెడదొకటి। గడికొకసారి ఆరతా ఎలుగుతా వుంటయ్। విసుగెత్తిపోద్దమ్మా। అందుకే ఆల్సెం అయింది।' సంజాయిషీ చెబుతున్నట్టుగా అన్నాడు శేషయ్య।

'ఫర్వాలేదు ఫర్వాలేదు. లేటయినందుకు నేనేం అనుకోటంలేదులే' అని రెండు ముద్దలు అన్నం తిని మళ్ళీ- 'ఇంట్లోకి కావల్సిన కిరాణా సామాన్లు మార్కెట్‌నుంచి కూరగాయలు తెస్తావు. బంగ్లాలో మొక్కలకి నీళ్ళు పోస్తావు. డాడీ కారుకూడ నువ్వే కదా తుడిచేది. మీ ఆవిడ రత్తమ్మ రోజూ వచ్చి మా ఇంట్లో అంట్లు తొల్చిపెడుతుంది. నువు రోజూ నాకు స్కూలుకి క్యారియర్ తెచ్చిస్తావు. ఆఫీసు పనిచేస్తూ కూడ ఇంత చాకిరీ చేస్తే, డాడీ నీకేమన్నా ఇస్తారా?' అని అడిగింది శశి।

శశి ప్రశ్నకి చకితుడయ్యేడు శేషయ్య। ఆ చిన్నపిల్ల తన గురించి ఇంతగా ఆలోచిస్తున్నందుకు కొంత వింతగానే తోచింది।

మెల్లిగా వచ్చి శశికి ఎదురుగా నేల మీద కూచుని అన్నాడు-

'బాబుగారు బ్యాంకులో పెద్ద ఆఫీసరు. అందుకే ఆయనకి బ్యాంకు పక్కనే ఇపుడున్న చిన్న బంగళా ఇచ్చారు. అటు ఇల్లూ, ఇటు బ్యాంకు దగ్గరే ఉంటంచేత ఏ పనయినా నాకు ఒకటిగానే ఉంటది. ఆయన చెప్పిన పని నేను చెయ్యాల. ఇదే నాకు తెలుసు. అది ఇంటిపనా, బ్యాంకుపనా అన్నది నా మతిలోకి రాదు. ఇంటిపని చేయకూడదు. బ్యాంకుపనయితేనే చెయ్యాల అన్న రూలు గురించి నేను పట్టించుకోను. బాబుగారు ఏమన్నా ఇచ్చినా ఇవ్వకపోయినా ఆయన ఏ పనిచెయ్యమని చెపితే అది చెయ్యటమే నా వంతు తల్లీ।' అన్నాడు శేషయ్య వినయంగా. శశి అంతా తల ఊపుతూ వింది. ఏ పనయినా ప్రతిఫలం ఆశించకుండా చెయ్యాలని క్రితం రోజే భగవద్గీత క్లాసులో నేర్చుకున్నది గుర్తుకొచ్చి ఆలోచనలో పడింది శశి। అలా ఆలోచిస్తూనే యాంత్రికంగా పెరుగన్నం తింటూ ఉండగా పలక మారింది।

'తిన్నగా బోంచెయ్ తల్లీ। గలాసు ఇట్టా ఇవ్వమ్మా మంచినీళ్ళు తెచ్చిస్తా' అంటూ గ్లాసు అందుకొని టాప్ దగ్గర నీళ్ళు పట్టి తెచ్చి శశికి అందించేడు శేషయ్య।

నీళ్ళు తాగుతూ ఉంటే- 'ఇంటికాడ

డైనింగు టేబుల్‌మీద తినే తల్లివి. ఈడ కింద అరుగుమీద కూకుని తినా లంటే కట్టవేఁ మరి!' అన్నాడు శేషయ్య నవ్వుతూ.

'మాకు డైనింగ్‌టేబుల్ లేదు శేషయ్యా ప్రస్తుతం. రెండేళ్ల క్రితం డాడీ ఇక్కడికి ట్రాన్స్‌ఫర్‌మీద వచ్చేస్తుండగా లారీలో తెస్తుంటే అది విరిగిపోయింది.' అని చెప్పింది. శశి!

'మరెట్టా చేత్తన్నారమ్మా! మీ లాటో ళ్లకి డైనింగ్‌టేబుల్ లేకోతుంటే కట్టం అవదా బోజనాలకి!' అన్నాడు అమాయ కంగా.

'అందుకే డాడీ కొత్త డైనింగ్ టేబుల్ చేయిస్తున్నారు. ఓ వారంరోజుల్లో రడీ అవుతుందని నిన్న చెప్పారు.' అంది శశి! తను ఖాళీచేసిన టిఫిన్ కారియర్ శేషయ్యకి అందిస్తూ!

శశి టాప్‌దగ్గర చేతులు శుభ్రంచేసు కుంటూ ఉంటే శేషయ్య టిఫిన్ కడిగి శుభ్రంచేసాడు.

'మరిక నే నెళ్ళొత్తా తల్లీ!' అన్నాడు శేషయ్య శశితో ఇవతలికి వచ్చేస్తూ!

'ఇదుగో శేషయ్యా నువు కాఫీగాని టిఫిన్‌గాని పుచ్చుకో' అంటూ తిరిగి వెళుతూ ఉన్న శేషయ్యచేతిలో ఓ రూపాయి పెట్టింది శశి!

'దండాలమ్మా' అన్నాడు కృతజ్ఞతగా శేషయ్య!

'చిన్నవాళ్లకి పెద్దవాళ్లు దండం పెట్ట కూడదు శేషయ్యా! థ్యాంక్స్ అనాలి' అంది నవ్వుతూ శశి!

'థ్యాంక్సు' అని అతి కష్టంగా చెప్పి శేషయ్య తెగ సిగ్గుపడిపోతూ బైటికి నడి చేడు. లంచ్ అవర్ అయినట్టు బెల్ విని పించగానే తన 'సెన్సుక్లాస్' రూమ్‌లోకి నడిచింది శశి!

## 2

ఆ రోజు స్కూలు వదిలెయ్యగానే రోజూ తన్ని ఇంటికి తీసుకుపోవటానికి వచ్చే కారుకోసం ఎదురుచూస్తూ కూచుంది శశి! కానీ ఎంతసేపటికి కారు రాకపోయే సరికి సిటీబస్‌లో ఇంటికి వెళదామని బస్‌స్టాప్ కేసి బయల్దేరింది. అలా నడుస్తూ కొంతదూరం వచ్చేసరికి వాన మొదలవ డంతో పరుగెత్తి దాని పక్కనే ఉన్న చెట్టుకింద నిలబడింది శశి! అప్పటికే చెట్టుకింద నిలబడిఉన్న శేషయ్యా, మరో కుర్రాడూ కనిపించగానే 'ఇంటికి వెళుతూ ఇలా నిలబడిపోయావా?' అంది శశి!

'అవునమ్మా! బస్సు దిగి ఎళతా చినుకు లకి ఇక్కడికి చేరాం. ఈడు మా పెద్దోడు. మొన్న కర్రాపేళ్ళు పగలేస్తావుంటే కంటికి దెబ్బతగిలింది. అస్పతాల్లో చూపించి తీసుకుపోతున్నా' అన్నాడు శేషయ్య!

'కన్నుకేం కాలేదు కదా' అంది శశి

ఆకుపచ్చని గుడ్డకట్టి ఉన్న కుర్రాడి కంటికేసి చూస్తూ।

'కంటికి దెబ్బ తగల్లేదు. కొలికిలో చిన్న పేడు గుచ్చుకుందంట. అది తీసి కట్టుగట్టారు. ప్రమాదమేం లేదు. ఓ వారంరోజుల్లో తగ్గిపోద్దన్నారు.' అని చెప్పేడు వివరంగా శేషయ్య।

'ఈ అబ్బాయి ఏం చేస్తున్నాడు.' అని అడిగింది శశి।

'చేత్తానికి ఏరే పనేవుందమ్మా సదుకోనోళ్లకి. ఈడూ మా చిన్నోడూ ఇద్దరూ కూలిపని కెళ్తన్నారమ్మా।' నిరాశకొంచం కూడ ధ్వనించకుండా శేషయ్య ఆ మాటలన్నా ఆ క్షణంలో అతని ముఖంలో తారట్లాడిన విషాదరేఖల్ని గమనించింది శశి।

'అందరూ పనిచేస్తారన్నమాట మీ ఇంట్లో....' అంది ఆ విషయం తాను కొత్తగా తెలుసుకున్నట్టుగా.

'చెయ్యకపోతే ఎట్టాగమ్మా. పూట గడవదు లేకపోతే. మరి ఇట్టాంటి అవాంతరాలు. జొరాలూ, జబ్బులూ ఇక ఉండనే ఉంటాయిగా।' అన్నాడు.

ఏదో అర్థం చేసుకుంటున్నట్టు తల ఊపుతూ నుంచుంది శశి।

వాన జోరు ఎక్కువైంది. జల్లుకి అక్కడ నుంచోటానికి కూడ వీల్లేకుండా కాళ్ళకిందికి నీళ్లు రాసాగేయి. పైనుంచి చెట్టుఆకుల సందుల్లోంచి పడుతోన్న వర్షానికి తల తడుస్తోంది. పోనీ ఆటోలో వెళదామని దారేపోయే ఆటోలని కేకపెట్టి పిల్చినా ఏ ఒక్కటీ ఆగలేదు. ఇదంతా చూసి- 'అమ్మా। వాన కుండపోతగా ఉంది. నా గుడిసె ఇక్కడికి దగ్గరే. ఒక్క పరుగుతీస్తే అడకి చేరిపోతాం. ఏం రేమనుకోకుండా మా గుడిసెకి దయ చేయండి।' అన్నాడు శేషయ్య.

ఆప్యాయంగా, గౌరవంగా శేషయ్య ఆహ్వానిస్తోంటే కాదనలేకపోయింది శశి। అందులోనూ తాను రోజూ కార్లో పోతూ చూసే గుడిసెల్లో నివసించే జనం ఎలా బతుకుతున్నారో తెలుసుకోవాలన్న కుతూహలం కూడ ఎక్కువ కావటంతో శేషయ్యతోపాటు జోరువానలో నడిచింది గబగబా పుస్తకాలసంచిలో ఉన్న రెయిన్ కోటు తీసి తొడుక్కుని.

ఎత్తైన ప్రదేశంలో ఉంది శేషయ్య గుడిసె। ఆ మురికివాడలో అప్పుడు కురుస్తున్న వానధాటికి అక్కడున్న రోడ్ల మీదున్న చెత్తాచెదారం అంతా కొట్టుకొనిపోయి శుభ్రంగానే ఉంది శేషయ్య గుడిసె పరిసరాలలో ఉన్న వాతావరణం।

బొమ్మ మంచంలా ఉన్న మంచం వాల్చి, ఉతికిన దుప్పటి పరిచి శశిని కూర్చోమన్నాడు శేషయ్య గుడిసెలోకి రాగానే తను తల తుడుచుకుంటూ.

'అయ్యా। చిన్నమ్మగోర్ని తీసుకొచ్చావా।' అంటూ సంబరపడింది రత్తమ్మ. శేషయ్య పెద్దకొడుకు ఎత్తి పెట్టిఉన్న మరో పొట్టిమంచం చాటుకి వెళ్ళిపోయేడు.

శేషయ్య చెప్పిందంతా విని, 'మంచి పనే చేసావు. ఈ జడివాన్లో అడకూతు రొక్కతే ఒంటరిగా అసువంటి సోటుండి పోతే ఏమన్నాఉందా ఈ మాయదారి కాలంలో' అంది రత్తమ్మ!

శేషయ్య- 'కిట్టిగాడింకా రాలేదేంటే. ఈ వాన్లో యాడన్నాడో ఏటో!' అన్నాడు తడిసిన చొక్కా పిండి ఓచోట పెట్టి, అతని పంచ చాలా పల్చగా ఉండటంతో అప్పుడే ఆరటం మొదలెట్టింది.

'సిన్నోడి సంగతేనా నువ్వనేది. ఆడి కోసం బెంగెందుకూ. ఎక్కడోక్కడ కూసేపు కూకుని ఎట్టాగొట్ట సేరుకోక పోతాడా!' అంది రత్తమ్మ పొయ్యిమీద అంబలి కాగబెట్టి.

శశి మంచంపైన కూచుని నిశితంగా బైటికిచూస్తూ పరిసరాలపై దృష్టి సారించింది. వాన తగ్గుముఖం పట్టగానే ఇరుగు పొరుగు గుడిసెల్లో పేదవాళ్లు వెలుపలికి వచ్చి గుడిసెలమీది తాటిఆకులు సరి చేసుకోసాగేరు. కొందరు అంతవరకూ కురిసిన వర్షాన్ని తిట్టుకుంటూ గోనెలు, గుడ్డలు తలమీద కప్పుకొని నిలబడ్డారు. కుక్కలు కొన్ని ఒళ్ళు విదిలించుకుంటూ పైకి తలఎత్తి మొరగసాగేయి. గుడిసెల్లోంచి కొన్ని కోళ్ళు రెక్కలు విప్పుకొని పరిగెత్తుతున్నాయి. పక్కనే పారుతోన్న మురుగుకాలవలో పొంచిఉన్న దుర్గంధం వాన తగ్గగానే మళ్ళా తల ఎత్తింది - తను పూర్తిగా సమసిపోలేదంటూ!

'సిన్నమ్మగోరూ! ఇందమ్మా రవ్వన్ని అంబలి తాగండి!' అన్న రత్తమ్మమాటలతో ఆలోచనల్లోంచి తేరుకొని 'ఇప్పుడివన్నీ ఎందుకూ' అంది కొంచెం బెదురుగా!

'పుచ్చుకో తల్లీ ఫరవాలేదు' శేషయ్య అదేం అపరాధం కాదన్నట్టుగా అన్నాడు.

'సూడమ్మా. మీ అంట్లు నేనేగా తొల్చేది. మీ బట్టలు కూడ ఉతికేది నేనే! అమ్మగోరికి రొట్టెలు వొత్తిపెట్టటం, బియ్యం ఏరడం ఈ పన్లన్నీ నా చేతుల్తో నేగా చేస్తాను. మరి ఈ సేతుల్తో ఇచ్చే అంబలి తాగడానికేం తల్లీ సిగ్గుపడక తీసుకోమ్మా' అంది ఓ ప్లాస్టిక్ గ్లాసు అందిస్తూ!

శశి బాగా కడిగి, అత్యంత పరిశుభ్రంగా కనిపిస్తోన్న ఆ ప్లాస్టిక్‌గ్లాసు అందుకొని అంబలి తాగుతోంటే - 'మీ నాన్నగారు అన్నంబల్ల చేపిత్తా ఉండారంటగా' అనడిగింది రత్తమ్మ శశిని!

అవునన్నట్టుగా తలవూపి ఖాళీచేసిన గ్లాసు కిందపెట్టింది శశి!

'అది తయారఖునంక ఇంటి కెట్టా చేర్చాలని మీ నాన్నగారు అనుకొంటున్నారంట. అపుడు లారీలో తెస్తా ఉంటే మీ అన్నాలబల్ల ఇరిగిపోయిం దంటగా; ఇపుడు ఈ కొత్తబల్ల కూడ బండిమీద కాని, రుచ్చాలోగాని తెస్తే ఏమవుద్దోనని

బయపడుతున్నారంట. మీ అమ్మగారికి కూడ అదే బెంగపట్టుకొంది.' అంది రత్తమ్మ।

'దానికంత ఇదయిపోవటం ఎందుకూ? మనం లేవంటే తయారవగానే నువ్వూ నేనూ మన కుఱ్ఱోళ్లిద్దరూ కలసి నెత్తి మీనెట్టుకొని మోసుకుపోయి అయ్యగారిల్లు జేరిస్తే పోలా' అన్నాడు శేషయ్య.

'అ౦! ఆ ఇసయమే నేనూ చెప్పా అమ్మగారితో....' అంది రత్తమ్మ।

'డాడీతో మీరిలా అన్నారని చెబుతాలే!' అంది శశి అక్కణ్ణుంచి బయల్దేరుతూ।

'ఇయ్యాళ ఇట్టా వాన రావటం నువు మా గడప తొక్కడం.... అంతా మాకు ఆనందంగా ఉంది తల్లీ....' అన్నాడు శేషయ్య శశిని ఇంటికి పంపిస్తూ। పేదవాళ్ల ఆదరం, అభిమానం ఎలా ఉంటాయో మొదటిసారిగా చూసి, వాళ్ళ కళ్ళల్లో వెలుగుతూన్న సంతృప్తీ, ఆనందం తనకి కూడ ఇదివరకు ఎన్నడూ కలగని ఆనందానుభూతిని కల్గిస్తూ ఉంటే అక్కణ్ణుంచి ఇంటికి బయల్దేరింది శశి।

## 3

ఓ నెల రోజులు గడిచిపోయాయి.

డైనింగ్ హాల్లో కొత్తగా ఇంటోకి చేర్చిన డైనింగ్ టేబుల్‌కి దూరంగా కిటికీ ప్రక్కనే కుర్చీ వేసుకొని కూచుంది శశి। నల్లగా నిగనిగలాడుతూ బలిసిన దున్నపోతులా ఉన్న ఆ డైనింగ్ టేబుల్ వేపు చూడలేకపోతోంది శశి। దానిమీద ప్లేటల్లో కలుపుకొని భోజనం చేయటానికి శశి మనస్సు తిరగబడుతోంది. బలవంతంగా ఒకవేళ ఇన్ని మెతుకులు తినటానికి ప్రయత్నించినా కలుపుకున్న ముద్ద గొంతుదిగటమే కష్టమైపోతోంది రోజురోజుకీ।

ఆ రోజు కూడ శశి భోజనం చేయనని మొరాయించి కూర్చుంది. తల్లి ఎంత బతిమాలినా బామాలినా శశి టేబుల్ దగ్గరికి కూడ రాలేదు.

శశికి శేషయ్య, రత్తమ్మ వాళ్ళపిల్లలూ గుర్తురాసాగేరు ఆలోచనలో పడిన శశికి కొద్ది రోజులక్రితం జరిగినదంతా ఒక్కసారి స్మృతిపథంలో మెదిలింది.

* * *

ఆ రోజు స్కూల్‌నుంచి ఇంటికి వచ్చి, పోర్టికోలో కారు దిగి లోపలికి వెళ్ళబోతూ ఉండగా లోపలి గదిలోంచి వినబడుతున్న సంభాషణ వింటూ వరండాలో అలాగే నిలుచుండిపోయింది కిటికీ పక్కగా శశి।

'ఇట్టా జరుగుద్దని కలలో కూడ అనుకోలేదు బాబూ! మా అదుట్టం బాగలేక ఇట్టా అయిందండి. డైనింగ్ టేబుల్ నెత్తిమీదెట్టుకొని మోసుకుంటూ మీరు చెప్పినట్టుగానే రోడ్డుమీద నిమ్మలంగానే నడుస్తా వస్తున్నాం. కొంత దూరం వచ్చేతలికి మావోడి కాలు మూతలేకుండా వదిలేసిన డ్రైనేజి

గుంటలో పడింది. దాంతో పట్టుదప్పి అది చేతుల్లోంచి జారిపట్టమే కాకుండా మా చేతుల్లోంచి కూడ జారి రోడ్డుమీద పడిపోయింది టేబులు. ఆ సమాయానికే అటేపుగా వస్తున్న లారీ దానిమీద నుంచి పోయింవంది. ఇంకేవుంది! అది పోయాక చెక్కముక్కలే మా కళ్లకుకనిపించాయి. ఇదంతా మా తలరాత బాబూ!' అన్నాడు శేషయ్య.

'కళ్లు నెత్తిమీద పెట్టుకొని పనిచేస్తే ఇలాకాక మరేమవుతుంది మరి? ఒళ్లు దగ్గరుంచుకోవాలి ఒకరి పని మనం చేస్తున్నప్పుడు.' అన్నాడు ప్రతాపరావు.

'మీరే అట్టాగంటే నేనేం చెప్పను బాబూ! ఇన్నాళ్ళమట్టీ- మీ ఇంటిపన్లు చేత్తా ఉన్నాం. ఎప్పుడన్నా ఒక్క పొరపాటు పనిచేసుంటే మీరే చెప్పండి. ఇందులో బుద్ధిపూర్వకంగా మేం చేసిందేంలేదు. మీకు నట్టం కలిగితే ఒకటీ నాక్కలిగితే ఒకటీనా బాబూ!' అన్నాడు దీనంగా శేషయ్య!

'నష్టమని తిన్నగా అంటావేమిటి. ఒకటా రెండా రెండువేల రూపాయలు ఖర్చయింది ఆ టేబుల్ చేయించడానికి తెలుసా?' అన్నాడు ప్రతాపరావు గొప్పగా!

'ఎందుకు తెలవదు బాబూ! అది యిలువైన వస్తువే! కాని నా అసువంటి దరిద్రుడి చేతుల్లో పడి మసైందండి, తల్సుకుంటే నాపై నాకే కసిగా ఉంది. మీరేంచేసినా సరే అనుబగించటానికి సిద్దంగా ఉన్నా బాబూ!' అన్నాడు.

'శిక్ష వేయటానికి నేనేమీ కోర్టు జడ్జీననుకున్నావా ఏం?' అని ఆలోచనలో పడ్డాడు ప్రతాపరావుగారు.

'మనకు ప్రాప్తంలేని వస్తువు పోతే వాడేం చేస్తాడు. పోతే పోయిందిలెండి. శేషయ్య పేదవాడు, వదిలెయ్యండి పాపం!' అంది శశి అమ్మగారు జ్ఞానమ్మ జాలిగా!

'భలేగా ఉందే నువు చెప్పటం. ఐతే రెండువేలూ ఏట్లో పోసినట్లు వదిలేసుకోమంటావా ఏం?" అన్నాడు ప్రతాపరావు.

'మరి వాడేం ఇవ్వగలడండీ. నెల జీతం రాళ్లతో బతికేవాడు.' అంది జ్ఞానమ్మ!


'జీతంరాళ్లతో వాడొక్కడేనా బతకటం. మనం మాత్రం బతకటం లేదా. నష్టం వస్తే ఎవరయినా భరించాల్సిందే!' అన్నాడు ప్రతాపరావు.

శశికి వాళ్ళ నాన్నగారు అంటున్న మాటలు నచ్చలేదు. ఇదివరకు టేబుల్ లారీ ప్రమాదంలో విరిగిపోతే తానే ఆ నష్టం భరించినవాడు తిరిగి ఇంచుమించు అలాంటి ప్రమాదమే సంభవించి వస్తువు పాడై పోగానే దానికి శేషయ్యే బాధ్యుడై నట్లు చెప్తూ, కలిగిన నష్టం అతనే భరించాలన్నట్లు మాట్లాడటం విని శశి చాలా బాధపడింది.

ప్రతాపరావు కొంచెంసేపు ఆలోచించి-

అక్కడ ఉండలేక లోపలికి వెళ్ళిపోయింది జ్ఞానమ్మ!

కాని విషబాణాల్లా ప్రతాపరావు మాటలు తనకొచ్చి తగిలినప్పటికీ ఏ మాత్రం చలించకుండా–'తప్పు నాదనేగా ఇపుడు అప్పుచేసి నన్ను డబ్బు కట్టమంటున్నారు. అలాగే కానీండి బాబూ! మీ మాట నే నెప్పుడైనా కాదన్నానా!' అని బాధగా గాద్గదికంగా అంటూ అక్కణుంచి



'ఏదో వందో రెండొందలో అయితే పోతేపోయిందిలే అనుకోవచ్చు. రెండు వేలు పెట్టి చేయించానది. ఇప్పుడు ఆ రెండువేలూ నష్టపోయినట్టేగా నీ వల్ల. ఉన్నపళంగా ఇప్పుడు అంత డబ్బూ తెచ్చి నిన్ను కట్టమని చెప్పటంలేదు. ఒక పని చెయ్! బ్యాంకులో రెండువేలు అప్పు పుచ్చుకొని నాకు ఇచ్చెయ్! అది మెల్లిగా వాయిదాల్లో తీర్చుకోవచ్చు!' అన్నాడు ప్రతాపరావు తియ్యతియ్యగా. ఆ మాటలతో మెత్తని కత్తితో శేషయ్య గొంతు కోస్తున్నట్లుగానే అనిపించి– ఇక కదిలిపోయే శేషయ్యని జాలిగా చూస్తూ అలాగే నిలబడిపోయింది శశి వరండాలో!

* * *

తన చేతిపైన వేడి కన్నీటిచుక్క పడటంతో కుర్చీలో కూచుని ఆలోచిస్తూ ఉన్న శశి ఉలిక్కిపడిందని తెలుసుకుంది. కాని ఎందుకో అర్థంకాలేదు!

బరువెక్కిన హృదయంతో డైనింగ్ టేబుల్ వేపు నడిచింది. దానిపైన పండ్లు, పాలు ఇంకా ఏవో అహార పదార్థాలు పెట్టి ఉన్నాయి. గోడగడియారం అప్పుడే పదకొండు గంటలు కొట్టడం వినిపించింది

శశికి! మెల్లిగా ఓ కుర్చీ లాక్కొని ఏమైనా తిందామని ప్రయత్నించింది. కాని, అందంగా నిగనిగలాడుతోన్న టేబుల్ ఉపరితలంలో- గుడెసెలో ఆకలి కడుపులతో, దిగులు ముఖాలతో గిన్నెలలో అంబలి తాగుతోన్న రత్తమ్మ శేషయ్యా అతని ఇద్దరి కొడుకులూ కనిపించేరు.

ఆ రోజున వర్షంలో శేషయ్య తనని గుడెసెకి తీసుకువెళ్ళటం, అక్కడ రత్తమ్మ ప్రేమతో కాచిఇచ్చిన అంబలి తను తాగటం అంతా ఒక్కసారి కళ్ళలో మెదిలింది. రత్తమ్మ అంబలి ఎంతో బాధ పడుతూ ఇచ్చింది ఆ రోజు! ఇపుడు వెదితే, పరోపకారబుద్ధితో తను చేసిన నేరానికి, జీతంలో మూడొంతులు పైగా అప్పుగా చెల్లిస్తూ ప్రతినెలా దాదాపు ఉత్తిచేతుల్తో ఇంటికి వెడుతోన్న శేషయ్య కాని, అతని భార్య రత్తమ్మ కాని తనకి ఆ అంబలి కూడ ఇవ్వలేరేమోనని అనిపించింది శశికి. ఆపైన ఏమీ తినటానికి మనస్కొప్పలేదు. హృదయంలో ఎక్కడో బాధ మూలుగుతోంటే బరువుగా అడుగులు వేసుకుంటూ వెళ్ళి మంచంపైన వాలిపోయింది శశి.

* * *

కొద్ది క్షణాల్లో డైనింగ్ టేబుల్ దగ్గరికి తిరిగివచ్చింది శశి! టేబుల్ మీదున్న ఆహార పదార్థాలు సువాసనలు వెదజల్లుతూ ఆకలి తీర్చుకోమన్నట్లు స్వాగతం పలుకుతున్నాయి.

శశి రెండడుగులే ముందుకు నడిచింది. శేషయ్యచేత అప్పు చేయించి గుంజుకున్న రెండువేలూ ఖర్చుపెట్టి ప్రతాపరావు కొత్తగా తయారు చేయించిన ఆ అందాల డైనింగ్ టేబుల్ తను చూస్తూ ఉండగానే నల్లని రాక్షసాకారంగా రూపొంది తన పైకి రావటం చూసి కెవ్వున కేకపెట్టి లోపలికి పరిగెత్తింది శశి!

* * *

కెవ్వుమంటూ శశి పెట్టిన కేకకు ప్రతాపరావు, జ్ఞానమ్మ నిద్రలోంచి లేచి శశి పడుకొని ఉన్న గదిలోకి వచ్చేరు.

అప్పుడే నిద్ర మేలుకొని మంచంపైన కూచుని ఉన్న శశి వాళ్ళకి కనిపించింది. ఒళ్ళంతా చెమటలు పట్టి ఉన్నాయి. జ్ఞానమ్మ వచ్చి శశి పక్కనే కూచుని- 'పాలుగాని, మంచినీళ్లుగాని తాగుతావా తల్లీ!' అంది. ఆమె మాటల్లో రత్తమ్మ గొంతు వినిపిస్తోంటే అవేవీ వద్దన్నట్టు తలఊపి- 'కొంచం అంబలి....'అంటూ వెంటనే మంచంపైన వెనక్కి వాలి అప్పటికప్పుడే మళ్ళా నిద్రలో మునిగింది శశి! ప్రతాపరావునీ, జ్ఞానమ్మనీ ఆశ్చర్యంలో ముంచేస్తూ!